ప్రజాశక్తి

శనివారం 24 జూన్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

గుంటూరు కౌన్సిల్‌లో దాహం కేకలు



- సమస్యలపై ధ్వజమెత్తిన ప్రజా ప్రతినిధులు
- టిడిపి, వైసిపి కార్పొరేటర్ల మధ్య ఘర్షణ
- సమావేశం నేటికి వాయిదా



మేయర్ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం వాడీవేడిగా జరిగింది. పలు అంశాలపై టిడిపి, వైసిపి కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వావాదం చోటుచేసుకుంది. ఒక దశలో ఘర్షణ వాతావరణం అలుముకుంది. గాంధీపార్కులో అభివృద్ధి పనుల పేరుతో చోటుచేసుకున్న అవినీతి, గుంటూరులో తాగునీటి ఎద్దడి, కుక్కల బెడద, అభివృద్ధి పనుల్లో జాప్యం, ప్రొటోకాల్ పాటించకపోవడం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గాంధీ పార్కు అభివృద్ధికి చేపట్టిన పనులు ఏమిటీ? ఎంత కేటాయించారు? ఈ పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయి? అని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు లిఖితపూర్వకంగా ప్రశ్నించారు. ఈ అంశంపై చర్చ ప్రారంభం కాగానే గాంధీ పార్కు అభివృద్ధిపై నిధులు ఎలా మంజూరు చేశారని, కౌన్సిల్ ఆమోదం పొందారా అని టిడిపి కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, కోవెలమూడి రవీంద్ర ప్రశ్నించడంతో అధికారులు పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. ఈ పనులకు ఎప్పుడు అనుమతి ఇచ్చారు? నిధులు ఎప్పుడు మంజూరు చేశారనే అంశంపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కోటేశ్వరరావు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంపై టిడిపి, వైసిపి సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఈ దశలో ప్రస్తుత కౌన్సిల్‌లోనే రహస్యంగా రూ.1.90 కోట్లకు అనుమతిచ్చారని కార్పొరేటర్ వరప్రసాద్ ఆరోపించడంతో వైసిపి కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వైసిపి కార్పొరేటర్ సంకురు శ్రీనివాసరావు, మరికొందరు టిడిపి

2లో



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న దళితులు, నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

పోలీస్‌స్టేషన్ వద్ద దళితుల ధర్నా

- దాడి చేసిన పెత్తందార్లపై కేసు, అరెస్టుకు డిమాండ్
- రౌడీషీటర్ ఫిర్యాదుతో బాధితుల మీదే కేసు పెట్టారని ఆగ్రహం

ప్రజాశక్తి - తాడికొండ

దళితులపై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ తాడికొండ పోలీస్ స్టేషన్ ఎదుట కంతేరు గ్రామ దళితులు శుక్రవారం బైఠాయించారు. పాత కక్షల నేపథ్యంలో తమవారిపై నంబూరు, వెనిగండ్ల, కొప్పురావూరు, కంతేరు గ్రామాలకు చెందిన పెత్తందారీ సామాజిక తరగతుల యువకులు గురువారం దాడి చేశారని, వారిపై ఫిర్యాదు చేసేందుకు బాధితులు స్టేషన్‌కు వెళ్లగా వారిని స్థానిక సిఐ జి.శ్రీనివాసరావు ఎమ్మెల్సీ కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని చెప్పారు. దాడిని ప్రోత్సహించిన కళ్లం హరికష్ణరెడ్డి, అతని సోదరుడు మనోహర్‌రెడ్డి నుండి ఫిర్యాదు తీసుకున్న సిఐ దళితులపైనే కేసు నమోదు చేశారని మండిపడ్డారు. దాడిలో గాయపడిన వారిపై కేసు ఎలా నమోదు చేస్తారంటూ సిఐతో వాగ్వాదానికి దిగారు. కళ్లం హరికష్ణరెడ్డి రౌడీషీటర్ అని, స్టేషన్‌లోనూ అతని ఫొటో ఉందని, అలాంటిది అతని ఫిర్యాదుతో దళితులకు అన్యాయం చేస్తారా? అని ప్రశ్నించారు. కేసు

2లో



సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు

విద్యుత్ ఛార్జీల పెంపుపై 30న ధర్నాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఈనెల 30న వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయాలు, సబ్‌స్టేషన్‌ల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు పిలుపునిచ్చారు. శుక్రవారం బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. బాబురావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎవరితో సంప్రదించకుండా, ఏకపక్షంగా విద్యుత్ ఛార్జీలు పెంచిందన్నారు. సర్దుబాటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, ఇంధన ఛార్జీలు, స్థిర ఛార్జీల పేరుతో అసలు బిల్లు కంటే అదనపు ఛార్జీల భారం మోపిందన్నారు. 2014 నుండి 2019 వరకూ వినియోగించుకున్న విద్యుత్‌పై రూ.2900 కోట్లు, ఇప్పుడు వినియోగదారునిపై భారాలు మోపడం అన్యాయమని, తక్షణమే ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరిగిపోయాయని, ఇప్పుడు విద్యుత్ ఛార్జీలు కూడా పెంచారని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలని జరుగుతున్న పాదయాత్రకు సిపిఎం జిల్లా కమిటీ సంఘీభావం తెలిపిందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో గత 50 ఏళ్ల నుండి వివిధ రకాల ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న

2లో



సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ప్రజలపై వైసిపి మోయలేని భారాలు

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య

ప్రజాశక్తి - నరసరావుపేట

కేంద్రంలోని బిజెపి విధానాలను అన్ని రాష్ట్రాల కంటే ముందుగా రాష్ట్రంలోని వైసిపి అమలు చేస్తూ ప్రజలపై మోయలేని భారాలేస్తోందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం పల్నాడు జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు సాధారణ మధ్యతరగతి ప్రజలు మోయలేని విధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే పట్టణాల్లో ఆస్తి విలువ ఆధారంగా పన్నులు వేస్తూ పట్టణ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు ద్వారా రూ.13 వేల కోట్లు పదేళ్లపాటు వసూలు చేసి అదాని కంపెనీలకు లాభాలు చేకూర్చే కేంద్ర ప్రభుత్వ విధానాలను వైసిపి అడ్డగోలుగా అమలు చేస్తోందని మండిపడ్డారు. ఈ విధానాలపై ప్రతిపక్ష టిడిపి, జనసేన నోరు మెదపడం లేదన్నారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు విత్తనాలు సరఫరా చేస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు ప్రచార ఆర్భాటమేనన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో లేవని చెప్పారు. గతేడాది ప్రకృతి వైపరీత్యాలతో అకాల

2లో

పుస్తకాలు లేకుంటే ఉపాధ్యాయులే బాధ్యులు

- పరిస్థితుల్లో మార్పు రాకుంటే చర్యలు
- పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్‌ప్రకాష్
- ఎస్టీ గురుకులంలో తనిఖీలు

ప్రజాశక్తి-తెనాలి

విద్యార్థుల వద్ద పాఠ్యపుస్తకాలు లేకుంటే దానికి ఉపాధ్యాయులే బాధ్యులని పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ హెచ్చరించారు. స్థానిక రావి రవీంద్రనాథ్ నగర్‌లోని ఎపిటిడబ్ల్యూఆర్ బాలికల పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ పుస్తకాలు, డిక్షనరీ లేనివారు ఎవరైనా ఉన్నారా? అని ప్రశ్నించగా కొందరు విద్యార్థులు తమవద్ద డిక్షనరీ లేదని చెప్పారు. గతేడాది కూడా కొందరికి డిక్షనరీ ఇవ్వలేదని చెప్పారు. దీంతో ఆయన డిక్షనరీ లేనివారిని, డిక్షనరీ ఉన్నవారిని రెండు బ్యాచ్‌లుగా

2లో



ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్



పీపుల్ సైంటిస్ట్ పుస్తకావిష్కరణలో నాయుడుమ్మ ట్రస్ట్ బృందం

డాక్టర్ ఎలవర్తి నాయుడుమ్మకు నివాళి

ప్రజాశక్తి - తెనాలి

శాస్త్ర సాంకేతిక రంగాల్లో డాక్టర్ యలవర్తి నాయుడమ్మ కీర్తి పతాకాన్ని ఎగరవేశారని నాయుడమ్మ ట్రస్ట్ సభ్యులు కొనియాడారు. ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ వర్థంతిని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ నాయుడుమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొలుత మార్కెట్ యార్డ్ సమీపంలోని నాయుడమ్మ విగ్రహానికి పూలమాలలేసి నివాళు లర్పించారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం మాట్లాడుతూ డాక్టర్ నాయుడమ్మ చర్మ పరిశోధన రంగంలో విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన పరిశోధనల ఫలితంగానే చర్మకారుల జీవనశైలి మెరుగుపడిందన్నారు. ఈ సందర్భంగా నాయుడుమ్మపై రచించిన పీపుల్ సైంటిస్ట్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొమ్మదేవర వెంకటేశ్వరరావు, ఎ.సుధాకర్, కె.వాసుదేవ నాయుడు, నాయుడమ్మ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిజిఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్

సిజిఆర్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి - తెనాలి

విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారమే ప్రధాన ఉద్దేశంగా విద్యుత్ అదాలత్ నిర్వహించినట్లు కన్జ్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెసల్ ఫోరం (సిజిఆర్ఎఫ్) చైర్మన్ ఎం.విక్టర్ ఇమ్మానుయేల్ చెప్పారు. శుక్రవారం స్థానిక చెంచుపేటలోని విద్యుత్ ఈఈ కార్యాలయంలో విజయవాడకు చెందిన సిజిఆర్ఎఫ్ బృందం విద్యుత్ అదాలత్ నిర్వహించారు. పలువురు వినియోగదారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని యోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. చైర్మన్ మాట్లాడుతూ సిజిఆర్ఎఫ్ పరిధిలో పరిష్కారానికి అనుకూలమైన ప్రతి సమస్యనూ త్వరితగతిన పరిష్కరి స్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఈఈ వివి.చిరంజీవి, డి.అశోక్ కుమార్, సిజిఆర్ఎఫ్ బృంద సభ్యులు ఎ.సునీత, ఎ.రాందాస్, వినియోగదారులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద దళితుల ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

నమోదుకు డబ్బెంత తీసుకున్నారని నిలదీశారు. హరికష్ణరెడ్డి అతని అనుచరులైన 40 మందిపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచాలని దీనిపై మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షులు డి.హేమప్రసాద్ డిమాండ్ చేశారు. స్టేషన్ బెయిలు ఇస్తే ఊరుకునేలేదని, గ్రామంలో దళితులు బిక్కు బిక్కు మంటూ బతుకుతుంటే హరికష్ణరెడ్డి ఇంటి వద్ద సిఐ శ్రీనివాసరావు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారని దుయ్యపట్టారు. దళితులకు న్యాయం చేయకుంటే అన్ని దళిత సంఘాలతో హైవేను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. గంటసేపు ఆందోళన అనంతరం వారితో మాట్లాడిన సిఐ ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేశారు.

ప్రభుత్వంపై కృత్రిమ వ్యతిరేకత సృష్టించే దిశగా ప్రతిపక్షం

సుపరిపాలన దిశగా అంధ్రప్రదేశ్ చర్చావేదికలో ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న కొమ్మినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తెనాలి

రాష్ట్రంలో జరగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన బెట్టి ప్రభుత్వంపై ప్రజల్లో కృత్రిమ వ్యతిరేకత సృష్టించే పనిలో ప్రతిపక్షం నిమగ్నమైందని ఏపీ ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. అవర్ స్టేట్ అవర్ లీడల్, వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపేటలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' పేరుతో చర్చా వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి అవర్ స్టేట్ అవర్ లీడల్ సంస్థ సభ్యులు కె.జయశంకర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 98శాతం హామీలను నెరవేర్చిందన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ చేపట్టని సంస్కరణలు, సంక్షేమానికి జగన్ శ్రీకారం చుట్టారని కొనియాడారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో రాష్ట్రం ముందంజలో ఉందని, ఇవన్నీ పక్కనబెట్టి ఏపీలో జరగరానిది జరిగిపోతుందని కొన్ని ప్రతిపక్ష అనుకూల మీడియాలు ఏకరువు పెడుతున్నాయని విమర్శించారు. ప్రతిపక్షాల విమర్శల్లో వాస్తవాలను ప్రజలు గమనించాలన్నారు. ఏపీ తెలుగు-సంస్కృతం అకాడమి చైర్‌పర్సన్ ఎన్.లక్ష్మీపార్వతి మాట్లాడుతూ అధికారంలో ఉండగా చంద్రబాబు విర్రవీగారని, చెప్పనలవి కాని అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. చంద్రబాబు లాంటి నీఛ సంస్కృతి కలిగిన వ్యక్తులు రాష్ట్రానికే అరిష్టమని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని సంక్షేమం వైపు నడిపంచే నాయకులు జగన్ ఒక్కరేనని, ఆయనకు ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జాన్‌బాబు, అవర్ స్టేట్ అవర్ లీడర్ ఫౌండర్ శాంతమూర్తి, సభ్యులు డాక్టర్ కారుమంచి రవికుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పలువురు అడిగిన ప్రశ్నలకు వక్తలు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో మహేష్‌రెడ్డి, అడపాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గుంటూరు కౌన్సిల్‌లో దాహం కేకలు

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేటర్లపైకి దూసుకువచ్చారు. కోవెలమూడి రవీంద్రపై దాడికి ప్రయత్నించడంతో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వాదప్రతిపాదనలతో కౌన్సిల్ సమావేశం అట్టుడుకింది. ఒకరిపై మరొకరు వ్యక్తిగత ఆరోపణలు చేసుకున్నారు. కార్పొరేటర్ సంకురు శ్రీనివాసరావుపై టిడిపి కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్ వ్యక్తిగత విమర్శ చేయడం ఘర్షణకు దారితీసింది. ఈ సందర్భంగా టిడిపి, వైసిపి కార్పొరేటర్లను డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు సర్ధి చెప్పారు. అధికారులు సమాధానం సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఇప్పుడే నిద్రలేచి వచ్చినట్టు సమాధానం చెబుతారేంటి? అని ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశం అంటే అధికారులకు లెక్కలేదని ఏ అంశంపైనా హోం వర్కు లేకుండా వస్తున్నారని రవీంద్ర విమర్శించారు. చారిత్రక ప్రదేశంగా ఉన్న గాంధీ పార్కు అభివృద్ధి విషయంలో అవినీతి జరిగినట్టు మీడియాలో వార్తలు వచ్చాయని అవినీతికి ఆస్కారం లేకుండా త్వరగా పూర్తి చేయాలని కోరారు. తాజా కౌన్సిల్ ఏర్పడకముందే ఆమోదం లభిస్తే ఇప్పుడు ఆమోదం పొందినట్టు అవినీతి జరిగినట్టు జిల్లా కలెక్టర్‌కు టిడిపి నాయకులు స్పందనలో ఫిర్యాదు చేసినట్లు వజ్రబాబు చెప్పారు. అసలు పార్కు పునరుద్ధరణ పనులపై స్థానిక ఎమ్మెల్యే ముస్తఫాకు కనీస సమాచారం ఇచ్చారా? అని అధికారులను ప్రశ్నించగా అధికారులు మౌనం వహించారు. తాను అవినీతికి పాల్పడినట్టు వచ్చిన ఆరోపణలను ఎమ్మెల్యే ముస్తాఫా ఖండించారు. తాను 40 ఎకరాలు పొలం అమ్ముకుని రెండుసార్లు ఎమ్మెల్యేను అయ్యాయని అన్నారు.

తాగునీటి సమస్య పై నిలదీసిన టిడిపి కార్పొరేటర్‌లు నిలదీశారు. నీటి ఎద్దడికి టిడిపి నేతలే కారణమని వైసిపి కార్పొరేటర్లు అనడంతో మరోసారి ఘర్షణ వాతావరణం తలెత్తింది. తొలుత ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ గత నెల రోజులుగా నగరంలో మంచినీటి సరఫరా సరిగా లేని విషయం వాస్తవమేనా? తీసుకున్న చర్యలు ఏమిటీ? గోరంట్ల రిజర్వాయర్ ఎప్పుడు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. ఇందుకు అధికారులు ఉండవల్లి రా వాటర్, మంగళగిరి పంపుహౌస్‌లు నీటి సరఫరాలో ఏర్పడుతున్న ఇబ్బందులు, విద్యుత్ సమస్యలను వివరించారు. నీటి ఎద్దడి పరిష్కారం కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని లక్ష్మణరావు కోరారు. పట్టాభిపురం, స్తంభాల గరువు తదితర ప్రాంతాల్లో రోజుకు అర్ధగంట కూడా నీరు రావడం లేదన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో నీరు రావడంలేదని తరచూ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విద్యుత్ సమస్య



ప్లకార్డులు చూపుతున్న టిడిపి కార్పొరేటర్లు

ప్రతి ఏటా వేసవిలో ఉంటుందని, జనరేటర్లు లేకపోతే ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ముస్తాఫా మాట్లాడుతూ రిజర్వాయర్లలో మట్టి పేరుకుపోయిందని, తొలగించాలని కోరారు. ఎస్ఇ భాస్కరరావు మాట్లాడుతూ ట్యాంకులను ప్రతినెలా శుభ్ర పరుస్తున్నారని, ఒక్కటి రెండు చోట్ల మట్టి ఉంటే తొలగిస్తామని అన్నారు. ముస్తాఫా ప్రతిస్పందిస్తూ ప్రతి ట్యాంకులో కూడా రెండు లారీల మట్టి పేరుకుపోయిందన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ నల్లపాడు చెరువును అభివృద్ధి చేసి వినియోగించుకుంటే కొన్ని ప్రాంతాలకు నీటి ఎద్దడి తగ్గుతుందన్నారు. బిఆర్ స్టేడియం ట్యాంకు కూలిపోవడానికి సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే ముస్తాఫా అన్నారు. 18 నెలల్లో బిఆర్ స్టేడియం ట్యాంకరు నిర్మిస్తామని ఎస్ఇ తెలిపారు. కమిషనర్ చేకూరి కీర్తి మాట్లాడుతూ గోరంట్ల రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కావాల్సి ఉందన్నారు. దీనినిపూర్తి చేస్తే టిడ్కోకు పూర్తిగా నీరు అందిస్తామన్నారు. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా రూ.170 కోట్లతో మరో 50 ఎంఎల్‌డి నిల్వ సామర్ధ్యంతో మరో పంపుహౌస్ నిర్మాణం చేపడతామన్నారు. ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ 2013లో రూ.460 కోట్లతో 15 లక్షల మందికి తాగునీటి అందించేందుకు రూపొందించిన పథకం పూర్తయినా ఇప్పటికీ నీటి ఎద్దడి ఉండటం బాధకరమన్నారు. ప్రస్తుతం నగర జనాభా 9.50 లక్షల మంది ఉన్నారని అయినా నీటి సరఫరాలో రోజూ ఇబ్బందులు వస్తున్నాయన్నారు. మేయర్ కావటిమనోహర్ నాయుడు మాట్లాడుతూ నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. వేసవి ముగిసిన తరువాత నీటి ఎద్దడిపై చర్చించడం విచారకరమని పలువురు కార్పొరేటర్లు విమర్శించారు. నగరంలో కుక్కల బెడదపై డిప్యూటీ మేయర్ షేక్ సజీల తీవ్ర నిరసన తెలిపారు. ఒక చిన్నారి మెడను కుక్క కరచిన ఘటనతోకూడిన ఫ్లెక్సీని ఆమె సమావేశంలో ప్రదర్శించి కన్నీరు పెట్టుకున్నారు. అధికారులు కనీసగౌరవం ఇవ్వడంలేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని అన్నారు. అధికారిక సమాచారాలన్నీ డిప్యూటీ మేయర్‌లకు తెలపాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను మేయర్ ఆదేశించారు. సమావేశం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగింది. అజెండా పూర్తికాక పోవడంతో సమావేశాన్ని శనివారానికి వాయిదా వేశారు.

విద్యుత్ ఛార్జీల పెంపుపై 30న ధర్నాలు

(మొదటి పేజీ తరువాయి)

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, రాజధాని ప్రాంతంలో ఏ గ్రామంలోని పేదలకు ఆ గ్రామంలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఆ ప్రాంతంలోని పేదలకు ఉపాధి ఆవకాశాలు కల్పించాలని కోరారు. పోలవరం నిర్వాశితుల పాదయాత్రకు సంఘీభావంగా ప్రజలు ఆర్థిక, వస్తు రూపేణా సహకారం అందించాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు ఛానల్, కొండవీడు వాగులో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటుకాడలను తొలిగించాలని, కాల్వలలో పూడిక తీయించి నీటి పారుదలకు అవకాశం కల్పించాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, ఎన్.భావన్నారాయణ, ఇ.అప్పారావు, కె.నళినీకాంత్, నాయకులు బి.కోటేశ్వరి, ఎల్.అరుణ, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజలపై వైసిపి మోయలేని భారాలు

(మొదటి పేజీ తరువాయి)

వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి విత్తనాలు, ఎరువులు రాయితీపై ఇవ్వాలని, రుణాలు మంజూరు చేయాలని కోరారు. రైతులకు టార్ఫాలిన్ పట్టాలు, ఇతర వ్యవసాయ పరికరాలను రాయితీపై ఇవ్వాలన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టుకు వచ్చేనెలలో సిఎం శంకుస్థాపన చేస్తారని ప్రకటించిన నేపథ్యంలో నిధులు కూడా విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరారు. సమావేశంలో సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, జి.రవిబాబు, నాయకులు డి.శివకుమారి, జి.మల్లేశ్వరి, జి.బాలకృష్ణ, టి.పెద్దిరాజు, కె.హనుమంతరెడ్డి, డి.విమల, జి.ఉమశ్రీ పాల్గొన్నారు.

పుస్తకాలు లేకుంటే ఉపాధ్యాయులే బాధ్యులు

(మొదటి పేజీ తరువాయి)

విభజించారు. దీనిపై మండల విద్యాధికారి ఎం.లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.విజయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవటంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎవరూ సరిగా పని చేయటం లేదని, విద్యార్థులతో సమీక్షించడం లేదని ఆగ్రహించారు. తనకు ఎవ్వరిమీదా కోపం లేదని, విద్యార్థుల భవిష్యత్ కోసమే కఠినంగా మాట్లాడాల్సి వస్తోందని అన్నారు. విద్యార్థులతో వాట్సప్ ద్వారా మళ్లీ మాట్లాడతామని, పరిస్థితిలో మార్పు రాకుంటే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులకు మెటీరియల్ అందుబాటులో ఉంచే బాధ్యత ఎంఇఒ, డిఈవోది కూడా అని స్పష్టం చేశారు. పుస్తకాలను ఇంటి వద్ద ఉంచకూడదని, పాఠశాల్లో తమతోపాటే పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఐ ప్యాక్ బృందాన్ని బయటకు పంపిన టిడిపి

ప్రశాంత్ కిషోర్ టీమ్‌కు చెందిన ఐప్యాక్ టీమ్ సభ్యులు సమావేశంలో అధికారుల పక్కన కూర్చోవడంపై టిడిపి కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. టిడిపి కార్పొరేటర్లు కోవెలమూడి, బుజ్జి తదితరులు వారిని బయటకు పంపాలని కోరారు. టిడిపి కార్పొరేటర్లు స్వయంగా వచ్చి వారిని బయటకు పంపారు. వీరిని వైసిపి ప్రజా ప్రతినిధులు తమ కారులో బయటకు పంపారు.

బోగస్ ఓట్లపైటిడిపినిరసన

నగరంలో ఒకే డోర్ నంబర్‌పై ఉన్న ఓట్లను తొలిగించాలని టిడిపి కార్పొరేటర్లు ప్లేకార్డుల ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. అయితే టిడిపి వారు చెప్పినట్టు అవి బోగస్ ఓట్లు కాదని, 2019 ముందు నుంచే ఒకే డోర్ నంబరులో 400 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని అదనపు కమిఠషనర్ తెలిపారు. ఈ అంశంపై చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ టిడిపి బోగస్ ఓట్ల వల్లే తాను ఓడిపోయాయని అన్నారు.

రూ.26,316 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా వార్షిక రుణ ప్రణాళికలను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి విడుదల చేశారు. లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో 2023-24 సంవత్సరానికి రూ.26,316 కోట్లతో రుణ లక్ష్యాన్ని నిర్దేశిస్తూ ప్రణాళిక విడుదల చేశారు. విభాగాల వారీగా మొత్తం ప్రణాళికలో వ్యవసాయ రంగానికి రూ.11,389 కోట్లు కేటాయించారు. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ స్వల్పకాలిక పంట రుణాలకు రూ.4380కోట్లు, రబీలో రూ.3044 కోట్లు, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలకు రూ.2,555 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాల కోసం రూ.200 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1210 కోట్లు రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి రూ.7800 కోట్లు, బలహీన వర్గాలకు రూ.1184 కోట్లు, మొత్తం ప్రాధాన్యతా రంగానికి రూ.20,442 కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం లక్ష్యంలో 43.28 శాతం ఈ రంగానికి కేటాయించి వ్యవసాయ రంగానికి, కౌలు రైతులు, రైతు మిత్ర గ్రూపులకు అధిక ప్రాధాన్యత ఇచ్చిట్లు చెప్పారు. రైతులు, కౌలు రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా ఋణాలు ఇవ్వాలన్నారు. ప్రతి మహిళను ఒక ఎంటర్ ప్రెన్యూర్‌గా చేయాలని, ముద్రా ఋణాలను, పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ పథకాల అర్హులైన ప్రతి ఒక్కరికీ సబ్బిడీ ద్వారా ఋణాలు అందించాలని, స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ద్వారా పెద్ద సంఖ్యలో యువతకి శిక్షణ ఇప్పించి వారిని ఉపాధి చేసుకునేంతవరకు తోడుగా ఉండాలని తెలియజేశారు. సమావేశంలో యుబిఐ డిజిఎం కుందన్‌లాల్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్‌రెడ్డి, నాబార్డు డిడిఎం శరత్ బాబు, ఆర్‌బిఐ లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ నాగప్రవీణ్, డీఆర్డీఏ , మెప్మా పీడీలు హరిహరనాథ్, వెంకట నారాయణ, బీసీ కార్పొరేషన్ ఈడి దుర్గాబాయి, మైనారిటీ కార్పొరేషన్ ఈడి సయ్యద్ సిరాజుల్లా, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



రుణప్రణాళిక విడుదల చేస్తున్న కలెక్టర్

ఆర్‌బికేల్లో విత్తనాలు, ఎరువుల సిద్ధంగా ఉంచాలి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో ముందస్తుగా అందుబాటులో వుండేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్‌లో వీసీ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఎన్.శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన జిల్లా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతుల అవసరాలకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో వుండేలా మండల వ్యవసాయ అధికారులు నిరంతరం పర్యవేక్షించి ఎప్పటికప్పుడు డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయాలు జరుగకుండా నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, తనిఖీలలో పట్టుబడిన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించేందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు పనులు ప్రారంభిస్తున్నందున పంట కాలువల నిర్వహణ, మరమ్మతులు మంజూరు పనులను వెంటనే పూర్తి చేసి , చివరి భూములకు సైతం సాగునీరు అందించేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కౌలు రైతులందరికి సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయించి బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించేందుకు వ్యవసాయ శాఖాధికారులు రెవెన్యూ, బ్యాంక్ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. సీహెచ్‌సీ సెంటర్‌లోని వ్యవసాయ యంత్ర పరికరాలు సంబంధిత రైతు భరోసా కేంద్రంలోని రైతులందరూ వినియోగించుకునేలా వ్యవసాయ అధికారులు ప్రణాళికా ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఎన్.శివరామకృష్ణ మాట్లాడుతూ ఇరిగేషన్ కెనాల్స్ నిర్వహణ పనులు నిర్దేశిత సమయంలో పూర్తి అయ్యేలా ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఎల్‌డిఎం మహిపాల్ రెడ్డి, నాబార్డ్ డీడీఎం శరత్‌బాబు, ఏపీ ఎంఐపీ పీడీ వజ్రశ్రీ, ఏపీ సీడ్స్ జియం జి. సుబ్బయ్య, మార్క్ ఫెడ్ డియం:ఆర్.జె. కష్ణరావు, ఇరిగేషన్ ఎస్.ఈ ఉమామహేశ్వరరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీయం జి. లక్ష్మీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - తుళ్లూరు

శుక్రవారం మండలంలోని పెదపరిమిలో అక్రమ మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణా, హర్యానాకు చెందిన మద్యం బాటిళ్లు కలిగిఉన్న ముగ్గురు వ్యక్తులను మంగళగిరి ఎస్ఈబి సిఐ మారయ్య బాబు బందం అదుపులోకి తీసుకుంది. 60 ఫుల్ బాటిళ్లు,ఒక కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో ఒకరు ఆర్మీలో విధులు నిర్వర్తిస్తున్నట్లు జెడి మహేష్ విలేకరుల సమావేశంలో చెప్పారు. ఈ సమావేశంలో ఈ ఎస్ అన్నపూర్ణ దేవి,ఎఈఎస్ మణికంఠ,ఎస్సైలు మల్లిఖార్జున్, కోటారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ పద్మజ, కానిస్టేబుల్స్ రమేష్, హనుమంతు, నాగరాజు, శ్రీనివాసరావు, రజని పాల్గొన్నారు.

నలుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పొన్నూరు మండలం రమణప్పపాలెం పంట పొలాల్లో కాకుండా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను శుక్రవారం పొన్నూరు రూరల్ ఎస్ఐ భార్గవ్ సిబ్బందితో వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు ముద్దాయిలపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరు స్తామని ఎస్ఐ భార్గవ్ తెలిపారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బైపాస్‌రోడ్డులోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న వాలీబాల్ లీగ్ పోటీలు రెండో రోజు శుక్రవారం ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఆదివారం వరకు పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. వాలీబాల్ లీగ్-2లో 32 జట్లు పాల్గొంటున్నాయి. గురువారం 24 జట్ల మధ్య 12 మ్యాచ్‌లు జరిగాయి. మొదటి స్టేజీలో 8 జట్ల మధ్య నాలుగు మ్యాచ్‌లు, రెండో స్టేజీలో 10 జట్ల మధ్య ఐదు మ్యాచ్‌లు నిర్వహించారు. మ్యాచ్‌లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, కె.శ్రీఅనిత, ఇట్టా భాస్కర్, పెంచలయ్య, ఎం.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



పైప్‌లైను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

నాగులపాడు గ్రామంలో తాగునీరు, వాడుకనీరు వాసన వస్తున్నాయని, మూడు రోజుల నుంచి తాగునీరు వదలడం లేదని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్యనే ఫిల్టర్ బెడ్ నిర్మాణం చేపట్టిన తాగునీరు వాసన ఎందుకు వస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మండల అధికారులు ఎమ్మార్వో, ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, నాగులపాడు గ్రామ సర్పంచ్, గ్రామ సెక్రెటరీలు నాగులపాడు చెరువుకు సాగర్ కాలవ నుండి వచ్చే పైపులైనును ట్రాక్టర్ మీద వెళ్లి పరిశీలించారు. అనంతరం మండల తహసిల్దార్ షేక్ మహబూబ్ సుభాని మాట్లాడుతూ నందిపాడు పరిసర ప్రాంతాల నుంచి మురుగునీరు చెరువు పైపులైన్లో కలుస్తుందని, అందువలనే నీరు వాసన వస్తున్నాయని, అలా జరగకుండా నిరోధిస్తామని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని వారు హామీ ఇచ్చారు.



చెరువుకు నీరు వదిలే పైపులైను పరిశీలిస్తున్న అధికారులు

రెగ్యులరైజేషన్ చేసి పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్‌లో గత 40 ఏళ్ల నుంచి తాము ప్రస్తుం ఉంటున్న ఇళ్లస్థలాలను రెగ్యులరైజేషన్ చేసి పట్టాలివ్వాలని సుందరయ్యనగర్ కట్టవాసులు తమ మనోగతం వెల్లడించారు. కొట్టె కరుణాకరరావు అధ్యక్షతన సుందరయ్యనగర్ సిపిఎం కార్యాలయంలో బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమకు వేరే ప్రాంతాల్లో స్థలాలిచ్చి ఇక్కడ నుంచి ఇళ్లు ఖాళీ చేయమంటే తమ జీవనోపాధి దెబ్బతింటుందని చెప్పారు. అంతేకాకుండా ఆర్థికంగా నష్టపోతామని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాజధానిలోన ఐనవోలు తదితర గ్రామాల్లో తమకు కేటాయించిన స్థలాల్లోకి వెళ్తే 40 సంవత్సరాలు వెనక్కి వెళ్లినట్లేనని వాపోయారు. ఈ సందర్భంగా తాడేపల్లి రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ సుందరయ్యనగర్ కట్ట, కృష్ణవేణి నగర్ ప్రజలకు నివాసముంటున్న చోటనే స్థలాలు రెగ్యులరైజేషన్ చేసి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లులేని పేదలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. మహానాడు అసైన్డ్ భూములను రెగ్యులరైజేషన్ చేసి పట్టాలివ్వాలన్నారు. మహానాడు కృష్ణానది ఒడ్డున రిటైనింగ్ వాల్ నిర్మించి అక్కడ నివాసముంటున్న ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వృత్తికళాకారుల రాష్ట్ర నాయకులు జగన్, పి.గిరిజ, ఎస్‌కె బాష, కె.ప్రభాకర్, బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ నుండి సర్టిఫికెట్ అందుకుంటున్న పిహెచ్‌సి వైద్యులు

ఫణిదం పిహెచ్‌సికి పురస్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ద్వారా ప్రతిష్టాత్మకమైన జాతీయ నాణ్యతా ప్రమాణాల హామీ సూచీ ధ్రువీకరణ సర్టిఫికెట్‌కు సత్తెనపల్లి మండలం ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపికైంది. పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ నుండి సర్టిఫికెట్ ను వైద్యాధికారులు శుక్రవారం అందుకున్నారు. వైద్యులు వైద్య సిబ్బంది సమిష్టి కృషికి ఇది నిదర్శనమని కలెక్టర్ అభినందించారు. నరసరావుపేటలో జిల్లా కలెక్టర్ చేతులమీదుగా సర్టిఫికెట్ ఫణిదం పి.హెచ్.సి వైద్యాధికారులు ప్రదీప్,యు.శ్రీలక్ష్మి కవిత అందుకున్నారు. ఈ పురస్కారం రావడానికి పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి సూచనలు, తోడ్పాటు అందించడంవల్లనే సాధ్యమైందని అన్నారు.వైద్యులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మలేరియా వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా పల్నాడు జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దినగర్ సచివాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా జాతీయ కీటక జనిత వ్యాధులపై, మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి వాటి నివారణ గురించి వివరించారు. దోమకాటు వలన వచ్చే మలేరియా, డెంగీ, చికున్ గున్యా, బోదకాలు, మెదడువాపు తదితర వ్యాధులు, దోమల ఆవాసాలను గుర్తించి వాటిని తొలగించే విధానం, దోమ తెరల వాడకం గురించి వివరించారు. 'ఫ్రైడే.. డ్రై డే' గా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆర్.సి.హెచ్ నారాయణ, చల్మారెడ్డి ,శివయ్య, జిలాని, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



జనన ధ్రువీకరణపత్రాలు అందజేత

ప్రజాశక్తి - తాడికొండ

జిల్లా పిడి బి.మనోరంజని ప్రత్యేక చొరవతో గుంటూరు జిజిహెచ్ నుండి 9 మంది శిశువుల జనన ధ్రువీకరణ పత్రాలను వారి తల్లులకు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కె.కృష్ణకుమారి అందజేశారు. ఆరేళ్ల లోపు పిల్లలందరికీ ఆధార్‌కార్డు తప్పనిసరి కనుక పుట్టిన ప్రతి బిడ్డకు కాన్పు జరిగిన హాస్పటల్ నుండి జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ తెచ్చుకొని ఆధార్ తీసుకోవాలని సూచించారు. ఐసిడిఎస్ సేవలు పొందాలంటే జనన ధ్రువీకరణపత్రాలను, ఆధార్ కార్డును తప్పనిసరిగా పొందాలని అన్నారు.

బాల్యంపై పుస్తకాల బరువు!

- విద్యార్థులపై భారం మోపుతున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు
- మోయాల్సిన బరువు కన్నా రెండు రెట్ల ఎక్కువ పుస్తకాలు
- స్కూల్ బ్యాగ్ యాప్‌పై కొరవడ్డ అవగాహన



ప్రజాశక్తి - పెదకూరపాడు

బడి గంటలు మోగాయి. ప్రవేట్ విద్యాసంస్థలు ప్రతి ఏడాది చదువుల పేరుతో చిన్నారుల వీపులపై పుస్తకాల భారాన్ని మోపుతున్నాయి పాఠ్యాంశాల బోధనలో నూతన విధానాలంటూ హెూంవర్క్‌ను ఎక్కువగా రుద్దుతూ పాఠ్య, నోటు పుస్తకాల సంఖ్యను మిక్కిలిగా పెంచుతున్నారు. ఎల్కేజీ విద్యార్థి కూడా ఐదు కిలోల బ్యాగు మోయాల్సి వస్తోంది. పిల్లల బ్యాగులను స్కూల్ వ్యాన్ వద్దకు ఉదయం తీసుకు వెళ్ళే వారిగా సాయంత్రం తీసుకువచ్చే వారిగా తల్లిదండ్రులు మారుతున్న పరిస్థితి ఏర్పడింది.

ప్రైవేటు,కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రాథమిక విద్యలో రకరకాల ఫౌండేషన్ పేరుతో చిన్నారులపై పుస్తకాల భారాన్ని విపరీతంగా మోపుతున్నాయి. ఆ బ్యాగును మోసకుంటూ మూడంతస్తుల భవనాల్లోనికి మెట్లు ఎక్కలేక ఆ విద్యార్థులు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. విద్యార్థులకు పుస్తకాల బరువు వలన కలిగే సమస్యలను పరిష్కరించడానికి 1988-89 విద్యా సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం యశ్పాల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ పలు అంశాలపై పరిశీలన చేసి విద్యార్థులు బరువులు మోయడం వల్ల మానసికంగా, శారీరకంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని నివేదించింది. విద్యార్థుల బరువులో 20 శాతానికి పుస్తకాలు అవసరమని ఆ కమిటీ తేల్చి చెప్పింది. కమిటీ సూచనల ప్రకారం ఒకటి,రెండు తరగతుల పిల్లలు రెండు కేజీలు, మూడు నాలుగు తరగతిల పిల్లలు మూడు కేజీలు, ఐదు నుండి 7వ తరగతి వరకు 4 కేజీలు, 8 నుండి 10వ తరగతి వరకు 6 కేజీలు వరకు మాత్రమే బరువు మోయవచ్చునని నిర్ధారించారు. ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే కమిటీ నిర్ధారించిన బరువు కంటే రెండు రెట్లు బరువున్న పుస్తకాలను మోయాల్సిన దుస్థితి ఉంది.

పెదకూరపాడు మండలంలోని ఐదు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలో నర్సరీ నుండి పదవ తరగతి వరకు 3,000 విద్యార్థినీ విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ఇప్పటివరకు హోంవర్క్, టెస్ట్ బుక్స్, కాపీ రైటింగ్ పుస్తకాల పేరుతో అత్యధికంగా పుస్తకాల వాడకాన్ని తప్పని సరిచేసి పాఠశాల యాజమాన్యాలు పిల్లలను ఇబ్బందికి గురి చేస్తున్నాయి.

చట్టం ఏం చెబుతోంది అంటే..

చిన్నారుల చదువు పేరుతో పుస్తకాల బరువును నియంత్రించడానికి స్కూల్ బ్యాగ్ యాప్ 2016ను తీసుకొచ్చారు. దీనిపై సరైన అవగాహన ప్రచారం లేక ప్రతి ఏటా చిన్నారులపై భారం పెరుగుతూనే ఉంది. ఎదిగే పిల్లలపై ఈ భారం ఉండకూడదని చట్టం తెచ్చారు. కానీ నేటికీ చట్టం అమలుకు నోచుకోలేదు. చట్ట ప్రకారం విద్యార్థుల బరువులో 20 శాతాన్ని మించి పుస్తకాలు సంచి బరువు ఉండకూడదు. ఇది అమలు చేయవలసిన బాధ్యత పాఠశాల యాజమాన్యాలది. నర్సరీ చదివే పిల్లలకు అసలు పుస్తకాలు ఉండకూడదు. ప్రతి పాఠశాలలో విద్యార్థులు బ్యాగులు పెట్టుకునేందుకు ప్రత్యేక లాకర్ సౌకర్యాన్ని కల్పించాలి. చట్టం నిబంధనలు తల్లిదండ్రులకు తెలిసేలా పాఠశాలలో బోర్డులు ఏర్పాటు చేయాలి. ఈ విధమైన అవగాహన కార్యక్రమాలు ఎక్కడ కనిపించడం లేదు. చట్టంలో నిబంధనలు అతిక్రమించిన విద్యాసంస్థలపై 3 లక్షల వరకు జరిమానా విధించవచ్చునని చట్టంలో పేర్కొన్నారు.ఒకటి,రెండు తరగతుల విద్యార్థులకు హోంవర్క్ ఇవ్వకూడదని మానవ వనరుల శాఖ స్పష్టం చేసింది. స్కూల్ బ్యాక్ బరువుల విషయంలో యశ్పాల్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని ఆదేశించింది.

తనిఖీ చేస్తాం: ఎంఇఒ ప్రసాదరావు



పాఠశాలలో మోతాదుకు మించి పుస్తకాలు మోయిం చే స్కూళ్లను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటాం. అన్ని ప్రైవేటు పాఠ శాలల యాజమాన్యాలు స్కూల్ బ్యాగు బరువు విషయంలో ప్రభుత్వము చెప్పిన నిబంధనకు లోబడి నడుచుకోవాలి. సెమిస్టర్ విధానం రాబోతుంది కనుక కొంత పుస్తకాల భారం తగ్గే అవకాశం ఉందన్నారు.

షెల్టరున్నా.. స్టాండింగే!

ప్రజాశక్తి - రెంటచింతల



మండల కేంద్రమైన రెంటచింతలలోనే ఆర్టీసీ బస్టాండ్ లో కూర్చోవడానికి వీలు లేక ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు ఎండలకు, వానలకు బస్సులు వచ్చేంతవరకు ప్రయాణికులు వేచి ఉండటానికి బస్టాండ్ నిండా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు అంతేకాకుండా హోటల్‌లో పనిచేసే కార్మికులు, యాచకులు,తదితరులు కూర్చొని గుట్కాలు ఖైనీలు నమిలి ఉమ్మి వేయడం వలన అపరిశుభ్రంగా ఉంటుందని పలువురు తెలుపుతున్నారు వద్ధులు, చిన్నారులు, గర్భిణులు కూర్చోడానికి షెల్టర్ లేక రోడ్లపైనే నిలబడి ఉండాల్సిన పరిస్థితి. కన్నెగంటి హనుమంతు సేవా సమితి అధ్యక్షులు విద్యావేత్త నారాయణ పురం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లూర్ధుమ రెడ్డి, పూజల వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి తదితరులు మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్, ప్రభుత్వ అధి కారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిం చాలని కోరారు

తీసిన గుంతలు పూడ్చరే!

ప్రజాశక్తి-చిలకలూరిపేట



పట్టణంలో తాగునీటి పైపులైన్‌ను మరమ్మతుల నిమిత్తం పగులగొట్టి.. పనులు పూర్తయినా గుంతలను మాత్రం ఇంత వరకూ పూడ్చని పరిస్థితి. పట్టణంలోని ప్రధాన రహదారులు చీరాల, నరసరావుపేట వైపు వెళ్లే మార్గంలోని గాంధీ పార్కుకు ఎదురుగా తాగునీటిపైపు లైన్‌ను సుమారు 25 రోజుల క్రితం పగులగొట్టారు. పనులు పూర్తయినా తీసిన గుంతలను పూడ్చని కారణంగా ఆ మార్గంలో ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో వాహనచోదకులు ఇబ్బందిపడు తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారిని పగులగొట్ట డంతో అటుగా వెళ్లాల్సిన ప్రజలు, వాహన చోదకులు గడియార స్తంభం వద్ద నుంచి కళా మందిర్ సెంటర్ వరకు వచ్చి పోయేవారికి ఒకే మార్గం కావడంతో తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. చీరాల నుంచి వచ్చే బస్సులు,వాహనాలను నంది పాడు బసాండ్ నుంచి కృష్ణమహల్, అర్బన్ పోలీస్ స్టేషన్ మీదుగా ఎన్.ఆర్.టి. సెంటర్‌లో కలపాలని, అడ్డ రోడ్డు నుంచి వచ్చే వాహనాలను ఎక్కడ ఆపకుండా నేరుగా కళామందిర్ సెంటర్ వద్ద గల చీరాల స్టాపు వరకు వెళ్ల నివ్వాలని వాహ నదారులు సూచిస్తున్నారు. గడియార స్తంభం వద్ద, నందిపాడు బస్టాండ్ వద్ద, కృష్ణ మహల్ వద్ద, శివాలయం వద్ద ట్రాఫిక్ పోలీ సులు నియమించి ఉదయం, సాయంత్రమ తప్పని సరిగా ఆయా చోట్ల ఉండేలా చూడాలని కోరు తున్నారు.



ఇక, ఈ మార్గంలో ఉన్న మెకానిక్,సెల్‌ఫోన్, ఫర్ని చర్, కూల్ డ్రింక్స్, కిచిడి విక్రయించే దుకాణాల వారు అయితే చాలా ఇబ్బంది పడుతున్నా మని, పూడ్చని గుం తల కారణంగా వచ్చే వారి సంఖ్య బాగా తగ్గిపోవ డంతో వ్యాపారాలు సాగడం లేదని చెబుతున్నారు. దానికి తోడు వర్షం పడటం వల్ల బురద బురదగా ఉం దని అన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తీసిన గుంతలు పూడ్చాలని కోరుతున్నారు.



పిల్లలను పనుల్లోకి చేర్చుకుంటే కేసులు

ప్రజాశక్తి-పెదకూరపాడు

పద్నాలుగేళ్లలోపు పిల్లలను పనుల్లోకి చేర్చుకొన్న యజమానులపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని సత్తెనపల్లి న్యాయ సేవాధికార కమిటీ పానెల్ సభ్యులు దివ్వెల శ్రీనివాసరావు పెండ్యాల భరత్ అన్నారు. బాల కార్మిక వ్యవస్థను అరికట్టేందుకు జరుగుతున్న ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక నాగ మల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు షేక్ సుబాని,విజయగోపాల్ మాట్లాడుతూ సమాజంలో విద్య యొక్క ప్రాముఖ్యత ,ప్రభుత్వం విద్యను ప్రోత్సహిస్తూ అందజేస్తున్న పలు పథకాల గురించి వివరించారు. పెదకూరపాడు గ్రామ కార్యదర్శి ఎ.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఒక్క బాల కార్మికుడు ఉండకూడదని, అందుకు అందరూ అందరు కృషి చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కారెంపూడి

మండలంలోని కారెంపూడి గాదేవారిపల్లి విద్యుత్ ఉప కేంద్రాలలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఎఇ కోటేశ్వరరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుత్ కోతలతో ఇక్కట్లు

స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో వాపోయిన చైర్‌పర్సన్, జెడ్పీటీసీలు

- పల్నాడులో టీచర్ల కొరత తీర్చాలి : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ కోతలతో ఇబ్బంది పడుతున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యుత్ కోతలపై అధికారుల్ని వివరణ కోరారు. మాకే కోతలు తప్పట్లేని అన్నారు. అలాగే ఫిరంగిపురం జెడ్పీటిసి కూడా ప్రస్తావించారు. గతంలో నల్లపాడు కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా చేసే వారని, ఇప్పుడు నర్సరావుపేట నుంచి ఇస్తున్నారని, దీంతో సరఫరాలో హెచ్చుతగ్గులు వస్తున్నాయని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పాఠశాలలు పున:ప్రారంభమైనందున నాడు-నేడు స్కూల్స్‌లో పనులు వేగవంతం చేయాలని జెడ్పిటిసిలు కోరారు. కాకుమాను జెడ్పీటిసి మాట్లాడుతూ ముట్లూరు-కొమరవోలు రోడ్డు అధ్వాన్నం ఉందని, తక్షణమే మరమ్మతులు చేయాలని కోరారు. వేమూరి జెడ్పిటిసి గాజుల హేమలత మాట్లాడుతూ జంపని హైస్కూల్ రోడ్డు బాగా పాడైందని, దీంతో విద్యార్థులు స్మశానం మీదుగా వెళ్లటానికి ఇబ్బందిపడుతున్నారని, తక్షణమే రోడ్డు వేయించాలని కోరారు. ఈ సమావేశాల్లో రూ.4 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పల్నాడులోని మారుమూల ప్రాంతాల్లోని అనేక పాఠశాలల్లో ఇప్పటికీ టీచర్ల కొరత ఉందని, కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఇఒ 2 పోస్టుల్లో హెచ్‌ఎంలను నియమించారని, అయితే ఎంఇఒలుగా నియమితులైన ప్రధానోపాధ్యాయుల ఖాళీల్లో కొత్త వారిని నియమించాలన్నారు. హెచ్‌ఎంలు లేకపోతే పాఠశాలల పర్యవేక్షణ కష్టతరం అవుతుందన్నారు. పిహెచ్‌సిల్లో వైద్యులు రోగులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను కోరారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్

నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు

ప్రైవేటు,కార్పొరేట్ స్కూళ్లలో అరికట్టాలని ఎంఇఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫాం, బూట్లను నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్నారని, వీటిని సత్వరమే నిలువరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఎంఇఒ సత్యనారాయణకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పి.మున్నా మాట్లాడుతూ మంగళగిరి పట్టణంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు వ్యాపార సంస్థలుగా మారాయని, ఇప్పటికే అధిక ఫీజులు వసూలు చేస్తూ అదనంగా పుస్తకాలు, యూనిఫాం భారాన్నీ వేస్తున్నారని చెప్పారు. వీటిని భరించలేని విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా అవస్థ పడుతున్నారని తెలిపారు. నిబంధనలు మీరి అమ్మకాలు చేపట్టిన విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, విక్రయాలను నిలురించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకులు అష్రఫ్ పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన

పట్టణంలో ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీకి వ్యతిరేకంగా ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఎంఇఒకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు బి.నాసర్, వై.గోపి, అభిషేక్, బి.యశ్వంత్, బి.గణేష్ పాల్గొన్నారు.

త్రిపురకు సంఘీభావ నిధి వసూలు

ప్రజాశక్తి-తాడేపల్లి

త్రిపుర రాష్ట్రంలో సిపిఎం శ్రేణులపై బిజెపి చేస్తున్న దాడులకు నిరసనగా ఉండవల్లి సెంటర్‌లో శుక్రవారం రాత్రి సంఘీభావ నిధి వసూలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ త్రిపురలో బిజెపి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగాన్ని కూనీ చేస్తుందని విమర్శించారు. పౌర హక్కులు కాలరాయబడుతున్నాయని అన్నారు. సిపిఎం, ఇతర ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకుని దాడులు, దౌర్జన్యాలు హత్యలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇటువంటి దుర్మార్గమైన దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఈమని రామారావు, టి.బక్కిరెడ్డి, గాంధీ, ఎస్‌కె పీరూసాహెబ్, వీరాస్వామి, బి.గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

30న విజయవాడలో ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈ నెల 30వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని శుక్రవారం ఉండవల్లిలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఆర్‌బికెల ద్వారా రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర వచ్చే చూడాలని, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలని కోరారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేసి రైతును ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, ఈమని రామారావు, పి.గాంధీ, ఎస్‌కె పీరూసాహెబ్, డి.వీరాస్వామి, డి.గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటిపై టిడిపి నిరసన

మేయర్‌ను అడ్డుకున్న మహిళలు

సమస్య లేకున్నా హడావుడి చేస్తున్నారని కావటి మండిపాటు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో తాగునీటి సమస్యపై శుక్రవారం టిడిపి నాయకులు, కార్యకర్తలు స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) ఆధ్వర్యంలో గుంటూరు నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో నగరపాలక సంస్థ వైఫల్యం చెందడంపై తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఖాళీ మట్టి కుండలతో నిరసన ప్రదర్శన చేశారు. కార్పొరేషన్ కార్యాలయం వద్దకు చేరుకున్న మేయర్ కి వ్యతిరేకంగా నినాదాలు చేసి, ఆయన వాహనం ఎదుట కుండలు పగలగొట్టి నిరసన వ్యక్తం చేశారు. సిఎం జగన్‌కు, మేయర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టిడిపి నాయకులపై మేయర్ మనోహర్ నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని మంచినీటి ఎద్దడి లేకపోయినా కావాలని రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. నగరంలో ఎక్కడ మంచినీటి సరఫరా కు ఇబ్బందిగా ఉందో టిడిపి నేతలు అక్కడికి రావాలని మేయర్ సవాల్ విసిరారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ వేసవికి ముందు జరిగిన కౌన్సిల్ సమావేశంలో మంచి నీరు సరఫరాపై చర్యలు తీసుకోవలసిందిగా కోరినా ఇప్పటివరకు పట్టించుకోవడం లేదన్నారు. నగరంలో అనేక ప్రాంతాల్లో ప్రజలు మంచి నీరు అందక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తాగునీటి సమస్యని పరిష్కరించి అన్ని ప్రాంతాల ప్రజలకు నీరు అందేలా చూడాలని కోరారు. మేయర్ నగరంలోని శాసన సభ్యులు అవినీతి సొమ్ము పంచుకోవటంలో పెట్టిన శ్రద్ద నగర అభివృద్ధిపై పెడితే బాగుండేది అని విమర్శించారు. కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, ఈరంటి వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరావు, మానం పద్మశ్రీ, ముప్పవరపు భారతి, పోతురాజు సమత, ఎల్లావుల అశోక్, నుకావరపు బాలాజీ, టిడిపి నాయకులు మానుకొండ శివప్రసాద్, కనపర్తి శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంత రావు, మానం శ్రీనివాస్, పాకలపాటి శ్రీకాంత్,మేళం సైదయ్య, నేపాక పద్మ, గంటా మౌళిక, కరీమున్నీసా, విజయలక్ష్మి, మన్నవ వంశీ, ధర్మ తేజ, షాహిద్ బాబు, వడ్లమూడి వెంకటేశ్వరావు, తెలగతోటి సుధీర్, వెలివేటి కృష్ణ, మార్క్, మీరావలి పాల్గొన్నారు.





కొమ్మినేనికి వినతిపత్రం అందిస్తున్న ఏపిడబ్ల్యూజెఎఫ్ నాయకులు

హౌసింగ్ కార్పొరేషన్ డిఈపై ఎసిబి దాడి

ఆదాయానికి మించి భారీ ఆస్తుల గుర్తింపు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్‌కి చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న చుంచు ఆంజనేయులు ఆదాయానికి మించి అక్రమ ఆస్తులు సంపాదించారని అవినీతి నిరోధక శాఖ అధికారులకు అందిన సమాచారం మేరకు శుక్రవారం ఏసిబి అధికారులు గుంటూరు, ఒంగోలు టౌన్ ఇళ్ళలో సోదాలు నిర్వహించి భారీగా అక్రమ ఆస్తులను గుర్తించారు. ఒంగోలు ఎసిబి అధికారుల సోదాలలో గుర్తించిన ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు లంబాడి డొంకలో మూడు అంతస్తుల ఇల్లు, ఒంగోలు భాగ్య నగర్‌లో ఒక ఫ్లాట్, ఒంగోలు మండలం కొప్పోలు గ్రామంలో 8 ఇళ్ల స్థలాలు, చీరాల టౌన్‌లో 8 పోర్షన్‌లతో కూడిన ఒక ఇల్లు, కొత్తపేట, చీరాలలో రెండు ఇళ్ల స్థలాలు, దైవాల రావూరు గ్రామంలో ఒక ఇల్లు, రెండు కార్లు, రెండు మోటార్ సైకిళ్లు, కేజీ బంగారు ఆభరణాలు, సుమారు 6 కేజీలు ఎలక్ట్రికల్ గాడ్జెట్లు, బ్యాంక్ బ్యాలెన్స్‌ను గుర్తించారు. చినగంజాం మండలం, కడవకు దురు గ్రామం వద్ద ఒక ఎకరం, 90 సెంట్లు వ్యవసాయ భూమి కొనుగోలు కోసం 50 లక్షల సేల్ డీడ్ అగ్రిమెంట్‌ను కనుగొన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చుంచు ఆంజనేయులు అతని ఇంట్లో ఇప్పటివరకు జరిపిన సోదాలలో ఎలక్ట్రికల్ గాడ్జెట్లు, బ్యాంక్ బ్యాలెన్స్‌లు, హౌస్ హెూల్డ్, పత్రాలు స్వాధీనం చేసుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు ఇంకా సోదాలను కొనసాగిస్తు న్నారు. ఆంజనేయులును అరెస్టు చేసి నెల్లూరు కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఎసిబి వర్గాలు తెలిపాయి.

సచివాలయ వ్యవస్థతో వినూత్న మార్పులు

వైసిపి సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ భార్గవ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలనలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని వైసిపి సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ సజ్జల భార్గవ్ చెప్పారు. వైసిపి సోషల్ మీడియా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం పొన్నూరు రోడ్డులోని ఏఆర్ కన్వెన్షన్ హాలులో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సజ్జల భార్గవ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం వైసిపి కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్ కృషి చేయాలని కోరారు. గత నాలుగేళ్లలో విద్య, వైద్యం, మహిళా సాధికారత, పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, రైతు భరోసా కేంద్రాలు ద్వారా మెరుగైనపాలన అందించడానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ 2024లో పేదలకు పెత్తందార్లకు మధ్య పోరాటం జరుగుతుందన్నారు. శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియా ప్రభావం విపరీతంగా పెరిగిందన్నారు. పార్టీని మరింతగా ప్రజలకు చేరువ చేయడంలో సోషల్ మీడియా ప్రతినిధులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. అందుకు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు వారికి తగిన విధంగా సహకరించాలని కోరారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ, పార్టీ విధి విధానాలను, ప్రభుత్వ ప్రయోజనాలను కింది స్థాయి వరకు తీసుకెళ్ళేందుకు సోషల్ మీడియా సైన్యం చేస్తున్న ప్రయత్నాలకు జిల్లా కమిటీ తరుపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యేలు ముస్తఫా, అన్నాబత్తుని శివకుమార్, కిలారు రోశయ్య, మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ టిడిపి అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, పార్టీ నేతలు నూరి ఫాతిమా, భీమనాధం భరత్‌రెడ్డి, పానుగంటి చైతన్య, సోషల్ మీడియా గుంటూరు జిల్లా కన్వినర్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై ఎపిడబ్ల్యూజెఎఫ్ వినతి

ప్రజాశక్తి-తెనాలి

జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్సు ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. స్థానిక కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు, తెలుగు-సంస్కృతం అకాడమి చైర్‌పర్సన్ ఎన్.లక్ష్మీపార్వతిని నాయకులు కలిశారు. జర్నలిస్టులకు నివేశన స్థలాలు కేటాయించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రతి వర్కింగ్ జర్నలిస్ట్‌కు అక్రిడిటేషన్ ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. మీడియాపై దాడులను అరికట్టేందుకు మీడయా కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ తరపున కొమ్మినేని, లక్ష్మీపార్వతిని సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కనపర్తి రత్నాకర్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మంచికలపూడి రవికుమార్, డి.కోటేశ్వరరావు, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు అంబటి శ్యామ్‌సాగర్, పుట్ల పున్నయ్య, వేమూరు నియోజకవర్గ అద్యక్ష కార్యదర్శులు ఎం.సుబ్బారావు, ఎం.సాంబశివరావు, సభ్యులు జి.ప్రభాకరరావు, ఎస్ఎస్ జహీర్, జి.ప్రకాశరావు, శేఖర్, ప్రేమ్‌కుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోరాటాలతోనే రైతు సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-నరసరావుపేట

పోరాటాల ద్వారానే రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మార్గం దొరుకుతుందని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు అన్నారు. స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం మహా ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30న విజయవాడలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేశాయని విమర్శించారు. రైతులకు కావాల్సిన విత్తనం దగ్గర నుండి విక్రయం వరకు తమదే బాధ్యత అంటున్న రైతు భరోసా కేంద్రాలు అలంకారప్రాయంగా ఉన్నాయన్నారు. అనేక ప్రాంతాల్లో ఇప్పటికే తొలకరి వర్షాలు కురిసినప్పటికీ విత్తనాలు,ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో లేవని విమర్శించారు. పల్నాడు జిల్లాలో గత మూడేళ్లుగా వరుసగా నకిలీ విత్తనాలతో రైతు నష్ట పోయిన దాఖలాలను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ శాఖాధికారులు మొక్కుబడి తనిఖీలతో సరి పెట్టకుండా క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయాలన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్దతు ధరలు తూతూ మంత్రంగా ఉన్నాయే తప్ప, రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా లేవన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై కూడా రాజకీయం చేస్తున్నారన్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై రాధాకృష్ణ, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, జి.రవిబాబు, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, జి.మల్లేశ్వరి, బాలకృష్ణ ,పెద్దిరాజు, హనుమంతరెడ్డి, ధరణికోట విమల, గద్దె ఉమ శ్రీ పాల్గొన్నారు.



పల్నాడు విజ్ఞాన కేంద్రంలో మహా ధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రైతు,ప్రజాసంఘాల నాయకులు



ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఒప్పంద అధ్యాపకులు

కనీస వేతనాల అమలు కోసం వినతి

ప్రజాశక్తి-నరసరావుపేట

స్థానిక జె.ఎన్.టి.యు కళాశాలలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులు శుక్రవారం తమ సమస్యలు పరిష్క రించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీని వాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఒప్పంద అధ్యాపకుల అసోసియేషన్ అధ్యక్షులు పోట్ల మణికంఠ మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఆర్థిక పరమైన ఇబ్బందులతో జీవితాలను గడుపుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. విశ్వవిద్యాలయాలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు కనీస వేతనాలు చెల్లించాలని ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు కంటే ఎక్కువ అర్హత వున్నపటికి అతితక్కువ వేతనం వస్తుందన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్కేల్ ప్రకారం కనీస వేతనాలు చెల్లించేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలపై సాను కూలంగా స్పందించిన ఎమ్మెల్యే, న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని మణికంఠ తెలిపారు. కార్య క్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్.రాకేష్, వి.హరికృష్ణ, ఉపాధ్యక్షుడు కె. చైతన్య , సాయి ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక 38వ వార్డులోని మదర్ థెరిసా కాలనీలోని మొండి బండ సంఘానికి చెందిన చేపల వెంకటేశ్వర్లు (32) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న 38వ వార్డు టిడిపి కౌన్సిలర్ జంగా సుజాత, వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి, మట్టి ఖర్చుల నిమిత్తం వారి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో జె. వినాయకరావు, ఎ.భూలక్ష్మి, నాగుల్ మీరావలి, డి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

27న బస్సు యాత్రను జయప్రదం చేయండి

టిడిపి అధికార ప్రతినిధి గోళ్ళ సురేష్ యాదవ్


ప్రజాశక్తి-కారెంపూడి

ఈ నెల 27 వ తేదీన జరగబోయే బస్ యాత్రను జయప్రదం చేయాలని టీడీపీ అధికార ప్రతినిధి గోళ్ళ సురేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మండలంలోని పేట సన్నేగళ్ళ గ్రామం నుండి మాచర్ల టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని నాయకులు కార్యకర్తలు పాల్గొని బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం నాయకులు ప్రజల్లోకి వెళ్లి ప్రజల యొక్క సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా ఉండాలనే ఈ కార్యక్రమం యొక్క ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు యు. లక్ష్మీనారాయణ, కె.బాలకృష్ణ, సిహెచ్ రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందాలనే దడ సంకల్పంతోనే ముఖ్యమంత్రి జగన్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు అని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు అన్నారు . శుక్రవారం ఆయన స్థానిక వెంకటేశ్వర గ్రాండ్ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ పరిధిలోని వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది, కన్వీనర్లుతో ఏర్పాటు చేసిన సమావేశంలో నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలతో కలసి ఆయన మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ అర్హులై వుండి ఏవో కొన్ని కారణాల రీత్యా సంక్షేమ పథకాలను పొందలేని వారికోసం ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు. 'జగనన్న సురక్ష'లో 11 రకాల సేవలను సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వారి అవసరాలను గుర్తించి వారికి అవసరమైన ధ్రువపత్రాలను ఎటువంటి రుసుం చెల్లించకుండా ప్రజలకు అందివ్వడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించటం జరిగిందన్నారు. ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎన్. రాజనారాయణ, ప్రముఖ న్యాయవాది పి.సూరిబాబు, డాక్టర్ నాగభూషణరెడ్డి, యార్డు చైర్మన్ పి.బాబురావు , సాంబశివరావు , షేక్ నాగుల్ మీరాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు



ప్రతి కౌలు రైతు సిసిఆర్‌సి పొందాలి

ప్రజాశక్తి-నరసరావుపేట

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం కౌలు రైతుల ప్రచార కార్యక్రమం యల్లమంద, గురవాయపాలెం, ఇక్కుర్తి గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ కౌలు రైతులుకు సిసిఆర్‌సి కార్డుల ద్వారా పొందే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు,బ్యాంక్ రుణాలపై అవగాహన కల్పించారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు పొందటం ద్వారా ఆర్థిక స్థితి గతులు కొంత మెరుగు పడతాయన్నారు. కౌలు రైతులు సాగు చేస్తున్న పం టలను ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం దళిత వాడల్లో ప్రచార సాధనం ద్వారా ప్రచారం ద్వారా రైతు లకు కరపత్రాలు అందజేశారు. డిబిఆర్‌సి సిటీ కోఆర్డినేటర్ వేణు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు సాయినాథ్, షహీద్ పాల్గొన్నారు.

'పథకాలు అందని అర్హుల తలుపు తడతాం'

ప్రజాశక్తి - నరసరావుపేట

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి నరసరావు పేట కలెక్టరేట్ ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందిస్తున్నామని, నోరు తెరచి అడగలేని వారు ఎక్కడైనా మిగిలి ఉంటే వారి ఇంటికి కూడా వెళ్ళి తలుపు తట్టి వాటిని అందజేయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ అన్నారు. అర్హత ఉండీ ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించి వారికి వాటిని అందించడమే 'జగనన్న సురక్ష' లక్ష్యం అని అన్నారు. సిబ్బంది బృందా లుగా ఏర్పడి అర్హత కలిగిన లబ్ధిదారులకు పథకాలు అంద జేయాలని, జులై 1 నుండి ఈ పథకాన్ని సమర్ధ వంతంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మండల ప్రత్యేక అధికారులు ఖచ్చితంగా వారికి కేటాయించిన మం డలంలో పర్యటించాలన్నారు. నెల రోజులపాటు జిల్లాలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధి కారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

రొంపిచర్ల మండలంలో వచ్చే నెల 1 నుండి 22 వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎండిఒ కె.మ్యాథ్యూబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీమ్ -1కు తహశీల్దార్ జి.అంకారావు, ఇఒపిఆర్డీ కె.విజయ రాము టీమ్ -2 కు తాను, డిప్యూటీ తహశీల్దార్ పి.బాల వెంకటేష్ ప్రాతినిధ్యం వహిస్తామని అన్నారు. మండలంలో వచ్చే నెల 1న అలవాల, అన్నవరం, 4న తురుమెళ్ళ, సంతగుడిపాడు, 6న గోగులపాడు, కర్లకుంట, 11న రొంపిచర్ల, మాచవరం, 13న బుచ్చిపాపన్నపాలెం, నల్లగార్ల పాడు, 15న ఆరేపల్లి, విప్పర్ల, 18న వడ్లమూడి వారిపాలెం, వి.రెడ్డి పాలెం, 20న విప్పర్లపల్లి, కొత్తపల్లి, 22న మునమాక, వీరవట్నం గ్రామసచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, రెవెన్యూ అధికారి తదితరులు

ప్రజాశక్తి-కారెంపూడి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నూతనంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకం పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి అందించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని ఎంపిడిఒ జి.శ్రీనివాసరెడ్డి,తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది,వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. జూలై 1 నుండి ప్రతి గ్రామంలో జగనన్న సురక్ష పథకం గ్రామసభలు వారంలో మూడు రోజులు జరుగుతాయని చెప్పారు. ఈవోపీఆర్డి సత్య ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ కీర్తి సుధా స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేద్దాం

ప్రజాశక్తి - రెంటచింతల

సమాజంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాత్ర వెలకట్టలేనిదని పిహెచ్‌సి వైద్యాధికారి ఎన్.కృష్ణారెడ్డి అన్నారు. ఇప్పటివరకు ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన అసిన్ ఖాన్, పొన్నూరు సమీపంలోని పాండుపాడుకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఒంగోలు నుండి శ్రీనివాసరావు ఇక్కడికి వచ్చారు ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు ఆయనకు సిబ్బంది ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

గట్లపై సాగుకు చిరు సంచులు

ప్రజాశక్తి-ఈపూరు

పంట పొలాలలో గట్లపై సాగు చేసేందుకు కంది పంట (చిరు సంచులు) ఆయా గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖాధికారి ఆర్.రామారావు శుక్రవారం తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపూరు మండలానికి 16 క్వింటాళ్లు కందులు వచ్చాయన్నారు. ప్రతి రైతుకు ఒక కేజీ చొప్పున పంపిణీ చేస్తామన్నారు. గట్లపై కంది సాగు చేయడం ద్వారా కనీస అవసరాలకు సరిపడా పప్పు ధాన్యాలు లభిస్తాయన్నారు. అలాగే ప్రతి గ్రామంలో భూసార పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు.కౌలుకు సాగు చేసే రైతులు కౌలు రైతు కార్డులు పొందాలని తెలిపారు.

డాక్టర్ బాలాజీకి ఇంటర్నేషనల్ అవార్డు

ప్రజాశక్తి - చిలకలూరిపేట




పట్టణానికి చెందిన శ్రీ దత్త సాయి అన్నదాన సమాజము, జయ జయ సాయి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పూసపాటి బాలాజీ కి హైదరాబాద్ లో బిర్లా సైన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఉన్న ఆడిటోరింలోఇంటర్నేషనల్ గౌతమ్ బుద్ధ అవార్డ్‌తో గురువారం సత్కరించారు. ఈ విషయాన్ని బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. గౌతమ బుద్ధ జయంతి ని పురస్క రించుకొని ఈ అవార్డు తనకు ఇచ్చినట్లు పేర్కొన్నారు.గత పదకొండేళ్లుగా పేదలకు చేస్తున్న సేవలకు గాను ఈ అవార్డు వచ్చిందని చెప్పారు.

అసైన్డ్ రైతులకు కౌలు జాప్యంపై నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతంలోని అసైన్డ్ రైతులకు కౌలు చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయడం పై సిపిఎం, అసైన్డ్ రైతులు నిరసన తెలిపారు. రాజధాని ప్రాంతం తుళ్లూరు ఎస్సీ కాలనీ లోని కమ్యూనిటీ హాలు వద్ద పెండింగ్ కౌలు చెల్లించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం అసైన్డ్ రైతులు నిరసనకు దిగారు. అసైన్డ్ రైతుల నిరసనలో పాల్గొన్న సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ,రాజధానిలో పేదలుగా ఉన్న అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించకుండా ప్రభుత్వం, సి ఆర్ డి ఎ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. అధికారులను ఎప్పుడు కలిసినా 10 రోజుల్లో కౌలు చెల్లిస్తామంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. వెంటనే రాజధాని అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించకపోతే అసైన్డ్ రైతులను సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడ సిఆర్డిఏ కార్యా లయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు .సిఐడి కేసులు పేరుతో అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించకుండా రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు.రెండు సంవత్సరాల నుండి పెండింగ్ కౌలు కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తున్న అసైన్డ్ రైతులకు నిరాశే మిగిలిందన్నారు. హైకోర్టుకు వెళ్లి కంప్లైంట్ చేస్తే తప్ప అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించరా?..అని ప్రశ్నించారు.

దళితులు, ఇతర పేదలైన అసైన్డ్ రైతులకు రెండు సంవత్సరాల నుండి కౌలు చెల్లించ కుండా వారి పట్ల దయా దాక్షిణ్యాలు లేకుండా ప్రభుత్వం, అధికారులు వ్యవహరించడం సబబు కాదన్నారు . ఇప్పటికైనా ప్రభుత్వం,సి ఆర్ డి ఎ అధికారులు స్పందించి అసైన్ రైతులకు పెండింగ్ ఉన్న రెండు సంవత్సరాల కౌలు వెంటనే చెల్లించాలని,నిర్లక్ష్యం వహిస్తే సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడ సిఆర్డిఎ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని రవి హెచ్చరించారు.సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ,అసైన్ రైతులంతా సంఘటితమైతేనే ప్రభుత్వం,అధికారులు దిగివస్తారని అన్నారు. అసైన్డ్ రైతులకు సిపిఎం అండగా ఉంటుందని సిపిఎం అండతో పెండింగ్ కౌలు సాధించుకునేందుకు అసైన్ రైతులంతా ఆందోళనలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు పి. బాబురావు, అసైన్డ్ రైతులు బి.రాజు,కె లాజరు,జె.సుబ్బమ్మ, కె నాగేంద్రం,ఎం వీరయ్య పాల్గొన్నారు.



సిపిఎం ఆధ్వర్యంలో అసైన్డ్ రైతుల నిరసన



కౌన్సిల్ హాలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆధునీకరించిన గుంటూరు నగరపాలకసంస్థ కౌన్సిల్ హాలును జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రూ.కోటితో ఏడాది పాటు చేపట్టినపనులు ఇటీవల పూర్తయ్యాయి. ప్రారంభోత్సంలో ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణరావు, లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరిఏసురత్నం, ఎమ్మెల్యేలు మద్దాలి గిరి, ముస్తాఫా, మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీమేయర్ డైమండ్ బాబు, సజీల, కమిషనర్ చేకూరి కీర్తి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కోస్టల్ కేర్ హాస్పిటల్ వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

స్వర్ణముఖి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టాభిపురం లయన్స్ క్లబ్ ఆఫ్ గుం టూరు సహకారంతో కోస్టల్ కేర్ హాస్పిటల్ శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించింది. అమరావతి రోడ్ లోని 6వ లైను గౌతమి నగర్ రజిక కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ క్యాంప్ లో మొత్తం 50 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రాయితీపై రక్త పరీక్షలు చేశారు. బిపి, షుగర్, కంటి, దంత పరీ క్షలు చేశారు. డాక్టం సలహాలు, సూచనలు అందజేశారు. వైద్య శిబిరంలో లయన్స్ క్లబ్, స్వర్ణముఖి ఫౌండేషన్ సభ్యులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న నాయకులు రామకృష్ణ

సాగు ధ్రువీకరణ పత్రాలు తీసుకోండి

ప్రజాశక్తి- మేడికొండూరు

కౌలు రైతులందరూ సాగు ధ్రువీకరణ పత్రాలు పొందాలని, అప్పుడే ప్రభుత్వం అందించే పలు రకాల పథకాలు వర్తిస్తాయని కౌలు రైతు సంఘం నాయకులు బొట్ల రామకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన మేడికొండూరులో శుక్రవారం సాగు ధ్రువీకరణ పత్రాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు బోట్ల రామకష్ణ మాట్లాడుతూ కౌలు రైతులు ఈ సంవత్సరం వ్యవసాయ కౌలుసాగుదారులు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని, వాటిని ఏ విధంగా తీసుకోవాలో సంబంధిత దరఖాస్తు ఫారాలను అందజేశారు. పూర్తిచేసిన ఫారాలను వీఆర్వో గాని ,రైతు భరోసాలో అధికారికి గానీ అందజేయాలని అన్నారు. సిసిఆర్సి కార్డు ఉంటేనే ప్రభుత్వ ఇచ్చే వ్యవ సాయము చేసే రైతుకు,రైతుభరోసా డబ్బులు గానీ, బ్యాంకు పంట రుణం ,పకతి నష్టపరిహారాలు గాని సాగు దారులకే వస్తాయని అన్నారు. ఎస్సీ కాలనీలోని కౌలు కమిటీ సభ్యులుగా పి.వీరయ్య, సిహెచ్ చిన్న శౌరిని ఎన్నుకున్నారు.

గుంటూరు ఛానల్ పొడిగింపు పనులు ఎక్కడివక్కడే

నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు కొల్లా రాజ మోహనరావు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పార్టీల విభేదాలు మరచి రైతులంతా ఏకతాటి పై నిలిచి గుంటూరు ఛానల్ పొడిగింపు విషయంలో పోరాటానికి సిద్ధం కావాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు, గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపు పోరాట యోధుడు డాక్టర్ కొల్లా రాజ మోహన్ రావు పిలుపు నిచ్చారు. శుక్రవారం సాయంత్రం పెదనందిపాడు లో నల్లమడ రైతు సంఘ కార్యదర్శి వై.అంకమ్మ చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుంటూరు ఛానల్ పొడిగింపునకు నిధుల సాధన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఇప్పటి వరకు నిధులు మంజూరు చేయని, ఇచ్చిన హామీలు అమలు చేయని రాజకీయ నాయకుల హామీలతో విసుగు చెందామని అన్నారు. 50 వేల ఎకరాలకు సాగునీరు, 50 గ్రామాలకు తాగునీరు అందించే గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగింపు పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందాన ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లాలో రైతుల వద్ద సేకరించిన భూములకు నోటిఫికేషన్ ఇచ్చి నిధులు మంజూరు చేయకపోవడం శోచనీయమన్నారు. బాపట్ల జిల్లా పర్చూరులో కూడా ఇదే పరిస్థితి నెలకొందన్నారు . రైతులు వద్ద సేకరించిన పొలాలకు డబ్బులు ఇచ్చి నప్పుడే పనులు ప్రారంభమవుతాయన్నది అక్షర సత్యమన్నారు.

రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు సూచన మేరకు తాను హైదరాబాదులో ఏపీ నాబార్డ్ జనరల్ మేనేజర్ పి.జయ కన్నన్ కలసి గుంటూరు ఛానల్ పొడిగింపు నాబార్డు నిధులు మంజూరు చేయాల్సిందిగా వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డి ఎన్నికలకు ముందు ఈ ప్రాంతా నికి పాద యాత్రలో భాగంగా వచ్చినప్పుడు కాకుమాను, పెద నందిపాడు, పత్తిపాడు, పర్చూరు మండలాల్లో ఈ ప్రాంత రైతుల ప్రధాన సమస్య అయిన గుంటూరు ఛానల్ పొడిగింపు పనులకు నిధులు సమకూర్చి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు పనుల విషయంలో కాలయాపన చేయటం పట్ల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ ఎన్నికల సమయం ఆసన్నమైందని ఇప్పుడే గుంటూరు ఛానల్ పొడిగింపు పనుల సాధనకు పోరాటం ఉధృతం చేయాల్సిన సమయమని, ఈ పోరాటాలకు తమ పూర్తి సహకారం అందజేస్తామని యువ రైతు సంఘ నాయకుడు కె. రాకేష్ ప్రకటించారు. మహిళా మండలి కార్యదర్శి ఈదర భ్రమరాంబ కొల్లా చిట్టెమ, మరి కొందరు మహిళా రైతులు మాట్లాడుతూ ఈ పోరాటంలో తాము అమరణ నిరాహార దీక్షలో అయినా పాల్గొనటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లావు అంకమ్మ చౌదరి మాట్లాడుతూ ముఖ్యమంత్రికి ఈ ప్రాంత రైతులు సమస్యలు తెలిసి కూడా గుంటూరు ఛానల్ పొడిగింపు పనులకు రూ. 250 కోట్లు నిధులు మంజూరు చేయలేకపోవడాన్ని ప్రశ్నించారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు బి. నాగేశ్వరరావు, ఎం.రాఘవయ్య, కె.రామన్, పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన రైతు సంఘం నాయకులు తమ సలహాలను సూచనలను అందజేశారు. తమ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టాలని సమావేశం నిర్ణయించింది..


సమావేశంలో మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజ మోహనరావు

శానిటేషన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

స్థానిక 12, 13, 14, 15 వార్డులలో శానిటేషన్ పనులను పొన్నూరు కమిషనర్ నయీమ్ అహ్మద్ శుక్రవారం పర్యవేక్షించారు. వార్డు శానిటరీ సెక్రటరీలు ,శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాదుకు పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం కంపోస్ట్ యార్ట్ పరిశీలించి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ పంపించిన మిషనరీతో యార్డును మొత్తం శుభ్రపరిచే విధంగా చూడాలని అన్నారు. అలాగే, ఇంజనీరింగ్ సెక్షన్ లో వాటర్ ప్లాంట్ ను పరిశీలించి దాని చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని, పాచి పట్టిన బెట్టిల్ని శుభ్రపరచాలని సూచించారు. ఇటికంపాడు రోడ్‌లో యానాది సంఘం దగ్గర పెద్ద కాల్వ లో పూడికలు తీసేందుకు వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, వెంకట్ దగ్గర ఉండి జెసిబి తో కాల్వల్లో పూడికలు తీయించాలని ఆదేశించారు.



విద్యాసంస్థల బస్సుల ఫిట్‌నెస్‌పై తనిఖీలు

ప్రజాశక్తి-తెనాలి



విద్యాసంస్థలకు చెందిన బస్సులు ఫిటనెస్‌ను తప్పనిసరిగా కలిగి ఉండాలని ఆర్టీవో కె.ప్రసాద్ చెప్పారు. రోడ్డు భద్రతా కార్యక్రమాల్లో భాగంగా రవాణాశాఖ అధికారులు పట్టణ, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం వాహనాల తనిఖీ చేప ట్టారు. ప్రధానంగా విద్యాసంస్థలకు చెందిన బస్సులను పరి శీలించారు. నిబంధనలు పాటించిన వాహనాలకు అపరాధ రుసుం విదించారు. ఆర్టీవో ప్రసాద్ మాట్లాడుతూ విద్యా సంస్థల వాహనానికి సంబందించిన అన్ని పత్రాలు ఫోర్స్‌లో ఉండాలన్నారు. బస్సులో ఫస్ట్‌ఎయిడ్ కిట్, అగ్నిమాపక సాధనం ఉండాలని చెప్పారు. రవాణా వాహనాలు, ద్విచక్ర వాహన చోదకులు రవాణాశాఖ నిబంధనలు విదిగా పాటించాల న్నారు. తనిఖీల్లో ఎంవిఐ రాఘవరావు, ఎఎంవిఐ మధు సూదనరావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి :విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉద యం తొమ్మిది గంటల నుంచి 1.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డిఇ సత్యనారాయణ, ఎఇ షణ్ముఖరావు ఓ ప్రకటనలో తెలిపారు. పోలకంపాడు, సాయినగర్, ఉండవల్లి సెంటర్, ఇఎస్ఐ ఆసు పత్రి, సీతానగరం, ఎంఆర్ఓ కార్యాలయం ఎదురు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

సింగిల్ మేజర్ ప్రోగ్రాంపై అవగాహన

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ :స్థానిక పిబిఎన్ కళాశాల నందు శుక్రవారం ఉదయం డిగ్రీ కోర్సుల యందు సింగల్ మేజర్ ప్రోగ్రాం పై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిబిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ శివకుమారి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రధాన అంశాలు వివరించారు.

పదో తరగతి విద్యార్థి కనిపించడంలేదు



ప్రజాశక్తి-తాడేపల్లి: ఈ ఫొటోలో కనిపిస్తున్న ఉండవల్లి అంబేద్కర్ నగర్‌కు చెందిన జె.వరుణ్ మం గళవారం నుంచి కనిపించడంలేదని తల్లి దండ్రులు మీడియాకు తెలిపారు. ఉండవల్లి సెంటర్‌లోని వంశీ టాలెంట్ స్కూల్లో పదో తరగతి చదు వుతున్న వరుణ్ స్కూల్ అని చెప్పి వెళ్లి మంగళవారం నుంచి తిరిగి ఇంటికి రాలేదని బాలుడు తండ్రి రాజు తెలిపారు. ఎవ రైనా ఈ బాబు గురించి సమాచారం తెలిస్తే 9966667582 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - తుళ్లూరు : తుళ్లూరు,తాడికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా అడుసుమిల్లి శ్రీనివాస్, షేక్ లియాకత్ అలీ ఎంపికయ్యారు.వీరికి శుక్రవారం అమరావతి నగర కాంగ్రెస్స్ పార్టీ అధ్యక్షులు కొమ్మినేని సురేష్ స్వగహంలో జరిగిన సమావేశంలో ఏపీసిసి ప్రధాన కార్యదర్శి చిలకా విజయ్ కుమార్ అభినందనలు తెలిపారు.శాలువాలు కప్పి సత్కరించారు. కాంగ్రెస్స్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వి.కోటేశ్వరరావు, పి. గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-తాడేపల్లి :మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య నగర్ లోని ప్రతిభా స్కూల్లో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వ హిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు వంగర సురేష్‌కుమార్ తెలి పారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే వైద్య శిబిరంలో ప్రముఖ డయాబెటిక్ వైద్యులు వేణుగోపాల రెడ్డి తో పాట పలువురు వైద్యులు వైద్యసేవలందిస్తారని తెలిపారు.

ఆవిర్భావ దినోత్సవ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-తాడేపల్లి :ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవ మహాసభ జులై 7న కాజలో జరుగుతున్న సందర్భంగా తాడేపల్లిలో ఎపి లీడ్ క్యాప్ చైర్మన్ రాజశేఖర్ కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో పలువురు ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భారవి, శివరామిరెడ్డి, నళినీకాంత్

విద్యుత్ ఛార్జీల పెంపుపై నేడు చర్చాగోష్ఠి

ప్రజాశక్తి-గుంటూరు : భారీగా పెరుగుతున్న విద్యుత్ బిల్లులు - అప్రకటిత విద్యుత్ కోతలు అనే అంశంపై శనివారం సాయంత్రం బ్రాడీపేట 2/7లోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఫెడరేషన్ ఆఫ్ అపార్ట్మెంట్స్ అండ్ కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఫాక్వా) ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి నిర్వహిస్తున్నట్లు ఫాక్వా, అవగాహన, గుంటూరు పౌర సంఘాల సమాఖ్య నాయకులు ఎల్.ఎస్.భారవి, కొండా శివరామిరెడ్డి, కె.నళినీకాంత్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బ్రాడీపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాయంత్రం 6 గంటలకు నిర్వహించే చర్చాగోష్ఠికి ముఖ్య అతిథిగా విజయవాడ రేట్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.ఆంజనేయులు పాల్గొంటారని తెలిపారు. తక్కువ యూనిట్ల విద్యుత్ వినియోగించుకున్నా బిల్లు ఎందుకు ఎక్కువ వస్తుంది..? పదేళ్ల నుండి వినియోగించిన విద్యుత్ తాలూకు ఛార్జీలు ప్రస్తుతం బిల్లులో ఎందుకు వేస్తున్నారు..? రాబోయే పదేళ్లకు అదనపు ఛార్జీల భారం ఇప్పటినుండే ఎందుకు? విద్యుత్తు సంస్కరణలు అంటే నాణ్యమైన విద్యుత్తా? అని ప్రశ్నిస్తూ ఆయా అంశాలపై చర్చాగోష్ఠిలో సవివరంగా చర్చించనున్నట్లు తెలిపారు. చర్చాగోష్ఠిలో వినియోగదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారికి

జర్మనీలో ఉద్యోగావకాశాలు

పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు

ప్రజాశక్తి - నరసరావుపేట

బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, టాక్ట్ ఇంటర్నేషనల్, ఎపిఎన్ఆర్‌టిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అర్హులు విజయవాడ కెఎల్ విశ్వవిద్యాలయంలో వచ్చే నెల 1 నుండి బి1 స్థాయి జర్మన్ భాషా శిక్షణ కోసం అందించే ఉచిత శిక్షలకు హాజరు కావాలని, శిక్షణ తరగతులు 2 నెలలు పాటు రోజుకు 6 గంటలు చొప్పున జరుగుతాయని తెలిపారు. శిక్షణా కాలంలో అభ్యర్థులే వసతి ఖర్చులు భరించాల్సి ఉంటుందని, అభ్యర్థి తప్పనిసరిగా నర్సింగ్ గ్రాడ్యుయేట్ అయి ఉండి కనీసం రెండేళ్లు పని అనుభవం, 20-35 ఏళ్ల లోపు వారై ఉండాలని పేర్కొన్నారు. చదువు, అనుభవ ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి విమాన ఛార్జీలు ఇచ్చి జర్మనీకి పంపుతామని, మొదటి ఆరు నెలలపాటు భోజనం, వసతి ఉచితంగానే సమకూరుస్తారని తెలిపారు. ప్రారంభ స్థూల వేతనం నెలకు వెయ్యి యూరోలు (భారతీయ కరెన్సీలో రూ.89 వేలు), తర్వాత 6 నెలల పాటు బి2 సర్టిఫికెట్ కోసం శిక్షణ అనంతరం బి2 పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే నెలకు 2500 యూరోలు (రూ.2.22 లక్షలు) వరకు వేతనం పెరుగుతుందని వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ ధ్రువ పత్రాలు, రెజ్యూమ్‌ను helpline@apssdc.inకు పంపించాలని, https:// www.apssdc.in/ home/ online ProgramRegistration లోనూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9988853335 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.



పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇవ్వాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజీలో సంతకాలు సేకరణ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందచేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కాలేజిలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. విద్యార్థినులు పెద్ద సంఖ్యలో వచ్చి సంతకాలు చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, అయితే కనీసం పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించలేకపోతుందని విమర్శించారు. ఈ ఏడాది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేమని, మీరే కొనుక్కోండని ఇంటర్ బోర్డు ప్రకటించటం వల్ల విద్యార్థులపై వేలాది రూపాయాల భారం పడుతోందని చెప్పారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయటానికే ఇలాంటి విధానాలను అనుసరిస్తున్నారని, విద్య బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకుంటుందని అన్నారు. టీచర్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయకుండా, మౌలిక సదుపాయాలు సమకూర్చకుండా రాష్ట్రంలో మంచి చదువులు అందిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకొని ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేయాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.రూపస్, నగర అధ్యక్ష కార్యదర్శులు పి.పద్మ, ఎస్.కె.సమీర్, నాయకులు స్రవంతి, గీత, వాణి, ఫాతిమా పాల్గొన్నారు.



సంతకాలు చేస్తున్న విద్యార్థినులు



సర్టిఫికెట్లు పొందిన క్యాడెట్లతో ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

ఎన్‌సిసిలో విద్యార్థినుల పాత్ర అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు

దేశభక్తి, సామాజిక సేవల్లో పురుషులతో సమానంగా మహిళా ఎన్‌సిసి క్యాడెట్ల పాత్ర అభినందనీయమని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్‌సిసి బాలికల విభాగ సర్టిఫికెట్-బి, సర్టిఫికెట్-సి పరీక్షల్లో ఉత్తీర్ణులై, మంచి ఫలితాలు సాధించిన 31 మంది క్యాడెట్లను శుక్రవారం కళాశాల యాజమాన్యం అభినందించి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కాలేజి సెక్రెటరీ, కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఎన్‌సిసిలో బాలికలు శిక్షణ పొందటం ద్వారా వారిలో మానసిక స్థైర్యంతోపాటు, ఆత్మరక్షణ పొందే విధంగా తయారవటమే కాకుండా, సామాజిక బాధ్యత కలిగిన మంచి పౌరులుగా సమాజంలో కీర్తించబడతారని అన్నారు. ఎన్‌సిసి సర్టిఫికెట్లు పొందిన విద్యార్థినులకు కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, కల్నల్ ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

విత్తనాలు పరిశీలిస్తున్న రైతులు



విత్తనాల కోసం బయలుదేరిన రైతులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఇప్పటి వరకూ వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులు ప్రస్తుత వర్షాలతో ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టారు. వర్షాలు కురువకముందే పొలాలు దున్నేసి సిద్ధంగా ఉంచగా ఇప్పుడు విత్తనాల కొనుగోలు ప్రారంభించారు. స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డు ఆవరణలో ఉన్న జిడిసిఎంఎస్ లిమిటెడ్ బ్రాంచ్‌లో శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నుండి వరి విత్తనాలు వచ్చాయి. సమాచారం తెలుసుకున్న రైతులు విత్తనాల కోసం తరలివచ్చారు. బిపిటి 52 04 రకం 25 కిలోలు రూ.1030, ఎంటియు 10 61 రకం రూ.వెయ్యి, ఎంటియు 12 62 రకం రూ.వెయ్యి బిపిటి 52 04 నంద్యాల 30 కిలోల బస్తా రూ.1200కు అమ్ముతున్నారు. మరోపక్క ఎరువులు కూడా అందుబాటులో ఉన్నట్లు బ్రాంచి మేనేజర్ సుబ్బారావు తెలిపారు. డిఎపి రూ.1350, 20 20 0 13 రూ.1200, సూపర్ ఫాస్ట్ రూ.520, యూరియా రూ.266, పొటాష్ రూ.1700కు అమ్ముతున్నారు. మండల వ్యాప్తంగా 24 వేల ఎకరాల మాగాణి భూములు ఉండగా 22 వేల ఎకరాలు వెద పద్ధతిన సాగవుతోంది. ఇదిలా ఉండగా విత్తనాలు, ఎరువులు ఎంఆర్‌పి ధరలకు లభిస్తున్నప్పటికీ గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీపై లభించిన జింక్, జిప్సం లభించడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని పెనుమూలి, కంఠంరాజు కొండూరు గ్రామాల పరిసర ప్రాంతాల్లో జింక్, జిప్సం లోపం ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు.

విజ్ఞాన్‌లో హైటెక్ నర్సరీ పనులు ప్రారంభం



నర్సరీ పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మనోజ్ దబాస్, లావు రత్తయ్య, శ్రీకృష్ణదేవరాయలు, విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అగ్రి, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలోని అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హైటెక్ నర్సరీ అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్ ఫామ్‌కు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి హాజరైన టీవోఎఫ్ఐ, సీఐఎఫ్ఓఆర్-ఐసీఆర్ఏఎఫ్ డెప్యూటీ చీఫ్ మనోజ్ దబాస్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో టీవోఎఫ్ఐ (ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా) ప్రోగ్రామ్ ద్వారా అవగాహన ఒప్పందం కుదుర్చుకొని, హైటెక్ నర్సరీని మొట్టమొదటిగా ప్రారంభిస్తున్న ఘనత విజ్ఞాన్స్ యూనివర్సిటీదేనని అన్నారు. టీవోఎఫ్ఐ ద్వారా అధిక నాణ్యత కలిగిన ప్లాంటింగ్ మెటీరియల్స్‌ను తయారు చేయటానికి కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్న విజ్ఞాన్ యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడి నుంచి టీవోఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్‌లో ఎంపిక చేసిన మూడు (పల్నాడు, ప్రకాశం, అన్నమయ్య) జిల్లాలకు నాణ్యమైన ప్లాంటింగ్ మెటీరియల్‌ను సరఫరా చేస్తామని చెప్పారు. టేకు, మామిడి, జామ, సపోట వంటి మొక్కలను ఈ ప్రోగ్రామ్ ద్వారా జెనటిక్ మెటీరియల్‌తో తయారుచేసి రైతులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ టీవోఎఫ్ఐ స్టేట్ కో-ఆర్డినేటర్ డి.జగన్‌మోహన్‌రెడ్డి, విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడారు.